క్లుప్తంగా

క్రీడా సామగ్రి పరిశీలన



క్రీడా సామగ్రిని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, తదితరులు

పులివెందుల టౌన్ : ఆడుదాం.. ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 18వ వార్డు సచివాలయానికి వచ్చిన క్రీడా సామగ్రిని మంగళవారం మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి పరిశీలించి మాట్లాడారు. ఈ క్రీడలలో పాల్గొనేందుకు 3358 మంది క్రీడాకారులు దరఖాస్తులు చేసుకున్నారని.. ఇంకా ఈ క్రీడా కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆసక్తిగల క్రీడాకారులు ఈనెల 13వ తేదీలోపు వారి వారి పరిధిలోని సచివాలయాలలో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండండి



నీటి ప్రవాహ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అర్బన్ సీఐ రాజు

పులివెందుల : తుఫాన్‌పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అర్బన్ సీఐ రాజు తెలిపారు. మంగళవారం జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు మిచాంగ్ తుఫాన్ దృష్టిలో ఉంచుకుని పులివెందుల మండలంలోని నీటి ప్రవాహ ప్రాంతాలను అర్బన్ సీఐ రాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని పలు సూచనలు చేశారు. అత్యవసరమైతే తప్ప ప్రయాణాలను, ఇతర పనులను రద్దు చేసుకోవాలన్నారు. విద్యుత్ స్తంభాలు, విద్యుత్ ప్రవహించుటకు వీలుండే వస్తువులను ముట్టుకోవద్దని, పాత మిద్దెలలో నివసించేవారు అప్రమత్తంగా ఉండాలన్నారు. పులివెందుల పోలీసులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని, ఏదైనా సమస్య తలెత్తినా 9121100544, 9121100546, 9121100547 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

తుఫాన్‌వల్ల ఎలాంటి పంట నష్టం జరగలేదు



పంటను పరిశీలిస్తున్న ఏఓ రాజేంద్రప్రసాద్

వేంపల్లె : రెండు రోజులుగా కురుస్తున్న మిచాంగ్ తుఫాన్‌వల్ల మండలంలో ఎలాంటి పంట నష్టం జరగలేదని మండల వ్యవసాయ అధికారి రాజేంద్రప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన సిబ్బందితో కలిసి వేంపల్లె మండల వ్యాప్తంగా పలు పంటలను పరిశీలించారు. అనంతరం రైతులకు పలు సూచనలు, సలహాలు చేసి మాట్లాడారు. పంట పొలాల్లో నీరు నిల్వ ఉన్నట్లయితే వెంటనే తొలగించుకోవాలని.. రానున్న రెండు రోజులు రైతులు జాగ్రత్తలు పాటించాలన్నారు. తుఫాన్ ముగిసిన తర్వాత నేల అరుదలకు వచ్చాక బూస్టర్ డోస్ కింద నైట్రోజన్ మరియు పొటాషియం ఎరువులను ఎకరాకు 25 కేజీల చొప్పున వేసి మళ్లీ కె-12 పిచికారి చేయాలన్నారు. రబీ పంటలకు సంబంధించి ఆర్‌బీకేలలో ఈ-క్రాప్ బుకింగ్ నమోదు చేసుకోవాలని రైతులకు సూచించారు.

ఈ క్రాప్ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి

కొండాపురం : రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రామంజినేయులురెడ్డి తెలిపారు. మంగళవారం బురుజుపల్లెలోని రైతుభరోసా కేంద్రంలో ఆయన రైతులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రకృతి వైపరీత్యాలతో ఏమైన పంటలు నష్టపోతే పరిహారం అందాలంటే తప్పనిసరిగా పంట నమోదు చేయించుకుంటేనే ప్రభుత్వం నుంచి ఇచ్చే పరిహారం అందుతుందన్నారు. మండలంలో ప్రతి రైతు ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయ సహాయకుల ద్వారా పంట నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు సురేష్‌బాబు, రైతులు పాల్గొన్నారు.

మళ్లీ వైఎస్ జగన్‌నే గెలిపించుకుందాం

పెండ్లిమర్రి : రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే గెలిపించుకుందామని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డి, ఎంపీపీ వరలక్ష్మిలు పిలుపునిచ్చారు. మండలంలోని మాచునూరు సచివాలయంలో మంగళవారం ఏపీ సీఎం జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్ పేద ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి రాష్ట్రాన్ని ఆదర్శ రాష్ట్రంగా మార్చారని కొనియాడారు. అనంతరం సంక్షేమ పథకాల లబ్ధిదారుల బోర్డు, మానమ్మకం నువ్వే జగనన్న జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు రమణారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ అమర్‌నాథ్‌రెడ్డి, సర్పంచ్ లావణ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు రఘునాథ్‌రెడ్డి, ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి, తహసీల్దార్ ఉదయభాస్కర్‌రాజు పాల్గొన్నారు.

ప్రగతి పథంలో శిల్పారామం

- రూ.14 కోట్ల వ్యయంతో అభివృద్ధి
- నూతన హంగులతో శిల్పారామం



పులివెందులలోని శిల్పారామ ముఖ ద్వారం

పులివెందుల టౌన్ : పులివెందుల ప్రాంత అభివృద్ధిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. అందులో ముఖ్యంగా శిల్పారామ అభివృద్ధికి పెద్ద పీట వేశారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా శిల్పారామాన్ని రూ.14 కోట్ల వ్యయంతో నూతన హంగులతో ఏర్పాటు చేయించారు. దీంతో శిల్పారామం సందర్శకులకు ఆహ్లాదాన్ని పంచుతోంది. శిల్పారామానికి వస్తేనే ఒక కొత్త ప్రపంచంలోకి వెళ్లిన అనుభూతి కలుగుతుంది. చిన్నారులకు ఆడుకునేందుకు జారుడు బల్లలు, ఊయలలు, పడవ షికారు, వివిధ రకాల ఆట వస్తువులతోపాటు రోప్ వే (జిప్‌లైన్) వద్ద 17అడుగుల వైఎస్సార్ విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. అదేవిధంగా మ్యూజికల్ వాటర్ ఫౌంటేన్ రకరకాల విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా ఆకట్టుకుంటోంది. శిల్పారామం పైభాగంలో హిల్ టాప్ టవర్ ఏర్పాటు చేసి అక్కడ 5 అడుగుల ఎత్తులో వైఎస్సార్ విగ్రహాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేయడం చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. అక్కడ నుంచి రోప్‌వే విధానం ఏర్పాటు చేయడం ద్వారా సందర్శకులు రోప్‌వేపై మక్కువ చూపుతూ పైభాగం నుండి కింద వరకు రోప్‌వే ద్వారా రావడం కొత్త అనుభూతిని పొందుతున్నారు. పర్యాటకుల పెరుగుదల కోసం ప్రధాన ద్వారం వద్ద ఆకర్షనీయమైన గజబోస్, ల్యాండ్ స్కేపింగ్ ఏర్పాటు చేశారు.

శిల్పారామంలో నూతన హంగులు

పులివెందులలో రూ.14 కోట్ల వ్యయంతో నూతన హంగులతో శిల్పారామం రూపుదిద్దుకుంది. అందులో భాగంగా రూ.91 లక్షలతో శిల్పారామం వద్ద బ్యాలెన్స్ కాంపౌండ్ వాల్ నిర్మాణం, రూ.92 లక్షలతో శిల్పారామం ప్రవేశ ద్వారం నుండి కొండపైకి సీసీ రోడ్డు, అద్దాలను ఏర్పాటు చేశారు. రూ.95 లక్షలతో శిల్పారామ కొండపై పార్కింగ్ జోన్ ఏర్పాటు చేశారు. అలాగే మౌలిక సదుపాయాల కోసం, ఫేస్ లిఫ్ట్ అప్‌గ్రేడ్, అదనపు సౌకర్యాల అభివృద్ధికి రూ.9.50 కోట్లను ఖర్చు చేశారు. శిల్పారామం వద్ద ఫౌంటెన్ గ్యాలరీ నిర్మాణం, స్టాల్ ముందు భాగంలో పాత్ వేస్ ఫ్లోరింగ్, ఎలక్ట్రికల్ పవర్ రూం ట్రాన్స్‌ఫార్మర్ అండ్ జనరేటర్ కొరకు రూ.1.78 కోట్లను ఖర్చు చేశారు. ప్రతి ఆదివారం, సెలవు దినాల్లో, పండుగ దినాల్లో కళాకారులచే వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

శిల్పారామ అభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి



రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న శిల్పారామాలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారని.. పర్యాటక రంగ అభివృద్ధి కోసం ఏ రాష్ట్రంలో లేని విధంగా నిధులను మంజూరు చేసి శిల్పారామాలకు కొత్తరూపు తీసుకొచ్చారు. పులివెందులలో శిల్పారామ అభివృద్ధికి రూ.14 కోట్ల నిధులను మంజూరు చేయించి పనులను నాణ్యతగా వేగవంతంగా పూర్తి చేసి ప్రారంభించారు. శిల్పారామం సందర్శకులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటోంది.

- డి.శ్యాంసుందర్‌రెడ్డి(శిల్పారామ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్), విజయవాడ

శిల్పారామాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారు

రాష్ట్రంలో ప్రధాన నగరాలలో ఉన్న శిల్పారామాలకు దీటుగా అన్ని మౌలిక సదుపాయాలు, సందర్శకుల రాక కోసం అనువైన వాటిని ఏర్పాటు చేయడంతో అనంతపురం జిల్లా కదిరి, తలుపుల, జిల్లాలోని ప్రొద్దుటూరు, కడప తదితర ప్రాంతాల నుంచి సందర్శకులు బాగా వస్తున్నారు. సెలవు దినాల్లో కళాకారులను ప్రోత్సహిస్తూ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయిస్తున్నాం. శిల్పారామం బాగా ఆకర్షణగా నిలుస్తోంది.

- సుధాకర్(శిల్పారామ ఏఓ), పులివెందుల



శిల్పారామంలో సమకూరిన జిప్‌లైన్ (రోప్ వే)



శిల్పారామంలో ఆకర్షణీయంగా వాటర్ ఫౌంటేన్



శిల్పారామంలోని సాంస్కృతిక కళా వేదిక



శిల్పారామాన్ని ప్రారంభిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి (ఫైల్)

హౌసింగ్ నిర్మాణ పనులను వేగవంతం చేయండి

ఎర్రగుంట్ల : పట్టణ పరిధిలోని జగనన్న కాలనీలో గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ పి.జగన్నాథ్ తెలిపారు. పట్టణంలోని ఐదవ సచివాలయంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడు గృహ నిర్మాణం పూర్తి చేసేలా ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. హౌసింగ్ శాఖ ఏఈ రామకృష్ణ, నోడల్ అధికారి దాశరధి సిచివాయల సిబ్బంది పాల్గొన్నారు.

కస్టమ్స్ ఆఫీసర్‌గా చింతల జూటూరు వాసి ఎంపిక



ఉదయ్‌కిరణ్‌రెడ్డి

వేముల : మండలంలోని చింతలజూటూరు గ్రామానికి చెందిన ఉదయ్‌కిరణ్‌రెడ్డి కస్టమ్స్ ఆఫీసర్‌గా ఎంపికయ్యారు. ఈయన తండ్రి బాల గంగిరెడ్డి హైదరాబాద్‌లోని సుల్తాన్‌బజార్ పీఎస్‌లో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్‌గా పనిచేస్తున్నారు. ఉదయ్ కిరణ్‌రెడ్డి టెన్త్, ఇంటర్ హైదరాబాద్‌లో చదివాడు. కంప్యూటర్ ఇంజనీరింగ్‌ను సీబీఐటీ కళాశాలలో పూర్తి చేశాడు. సీబీఐటీ క్యాంపస్ ఇంటర్వ్యూలో పెగసిస్టమ్ కంపెనీలో ఉద్యోగం రాగా.. ఆరు నెలలు పనిచేసి రాజీనామా చేసి.. హైదరాబాద్‌లో సివిల్స్ కోచింగ్ తీసుకున్నాడు. 2022–23 సంవత్సరానికి ఎస్ఎస్‌సీ సీజీఎల్ (స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్) పరీక్ష రాసి మొదటి ప్రయత్నంలోనే ఇన్‌స్పెక్టర్ ప్రివెంటివ్ ఆఫీసర్‌గా(కస్టమ్స్ ఆఫీసర్)గా ఉద్యోగం సంపాదించాడు. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నూతన నియామకం

చెన్నూరు : మండలానికి చెందిన తనను వైఎస్సార్ సీపీ జిల్లా స్టూడెంట్ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు తుమ్మల సాయికుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ స్టూడెంట్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు చైతన్య, యూనియన్ అధ్యక్షుడు దత్తసాయిలు ఈ మేరకు తనను నియమించి తనకు నియామక పత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ స్టూడెంట్ యూనియన్ నాయకులు కల్లూరు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు

ఘనంగా అష్టబంధన కుంభాభిషేకం



స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు కరుణాకర్, తదితరులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని శ్రీ వెంకటరమణుడి ఆలయంలో ఈనెల 2వ తేదీనుంచి ప్రారంభమైన అష్టబంధన కుంభాభిషేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం శిఖరాగ్ర కలశాలకు నది జలాలతో సంప్రోక్షణను ఆలయ ప్రధాన అర్చకులు వరదాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా ఆలయంలో తదితర అభిషేకాలు నిర్వహించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిల ఆదేశాల మేరకు చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వామివారికి పట్టు వస్త్రాలను ఆలయ కమిటీ సభ్యులు మిట్టా కరుణాకర్ చేతులమీదుగా అందజేశారు. అర్చకులు మాట్లాడుతూ 12 ఏళ్లకొకసారి జరిగే ఈ అష్టబంధన కుంభాభిషేక కార్యక్రమాన్ని ఆలయంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్నామన్నారు. గురువారం స్వామివారి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

బాధితులకు న్యాయం చేస్తాం



ఆర్డీఓతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి

జమ్మలమడుగు : స్టీల్‌ప్లాంట్ నిర్మాణం కోసం భూములు కోల్పోయిన బాధితులకు తప్పకుండా న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్టీల్‌ప్లాంట్ బాధితులతో ఆర్డీఓ ఞి.శ్రీనివాసులను ఎమ్మెల్యే కలిసి మాట్లాడారు. రెండు ఎకరాల భూమి కోల్పోయిన రైతులకు ఎకరా భూములు కోల్పోయిన రైతులకు ఇప్పటికే పరిహారం ఇచ్చారు. అయితే ఒకే సర్వేనంబర్‌పైన ఇద్దరు పేర్లు ఉన్నాయని వాటిని ఒకరి పేరుమీదనే పరిహారం ఇప్పించాలంటూ బాధితులు కోరుతున్నారన్నారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ దాదాపు పరిహారం అందరి రైతులకు ఇవ్వడం జరిగింది. ఒకే సర్వేనంబర్‌పేరు మీద ఇద్దరి పేర్లు ఉండటంతో వారిలో పరిహారం ఎవరికి ఇవ్వాలో అర్థంకాక నిలిపామన్నారు. ఒకరిపేరుతో పరిహారం ఇప్పించేందుకు లిస్టును ఉన్నతాధికారులకు పంపించి తర్వాత పరిహారం ఇప్పిస్తామని ఆర్డీఓ తెలిపారు.

పంటల్లో నీరు నిల్వ లేకుండా చూడాలి



కమలాపురంలో పంటలను పరిశీలిస్తున్న ఏఓ సరస్వతి



చెన్నూరు : దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

కమలాపురం : తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షానికి పంట పొలాల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఏఓ సరస్వతి తెలిపారు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు కురిసిన భారీ వర్షానికి మండలంలో 38.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఈ వర్షం ధాటికి పలు చోట్ల పంటలు నీట మునిగాయి. చదిపిరాళ్ల పొలంలో మినుము పంట పెరికి అక్కడే ఉంచడంతో విత్తనాలు మొసులొచ్చాయని బాధిత రైతు రామ లింగారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. 4 ఏకరాల్లో మినుము పంట సాగు చేశానని, పంట నూర్పిళ్లు కూడా చేశానని, ఇంటికి చేర్చే సమయంలో వర్షం రావడంతో మొసులొచ్చాయని, దాదాపు లక్ష రుపాయలు నష్టం వాటిల్లిందని ప్రభుత్వం ఆదుకోవాలని ఆవేదన వ్యక్తం చేశాడు. కాగా మండల ఏఓ సరస్వతి చదిపిరాళ్ల, గొల్లపల్లె తదితర గ్రామాలలో ఆమె పర్యటించారు. పంట పొలాలను సందర్శించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. ముఖ్యంగా వరి పంటలో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గట్లు తెంచి నీరు పొలాల నుంచి బయటకు వేళ్లేలా చూడాలన్నారు. అలాగే కొతకు వచ్చిన వరి కాడలను కలిపి ముడి వేయాలన్నారు. అప్పుడు గింజలు తడవవు అన్నారు. అలాగే మిగిలిన పంటలను కూడా జాగ్రత్తగా కాపాడుకోవాలన్నారు. వర్షం తగ్గిన తర్వాత సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు. వీఏఏ లాలిత్య, రైతులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

చెన్నూరు : మండలంలో మిచాంగ్ తుఫాను వల్ల దెబ్బతిన్న పంటలను మంగళవారం మండల వ్యవసాయ అధికారి, స్థానిక ప్రజా ప్రతినిధులు పరిశీలించారు. మండల వ్యాప్తంగా 250 ఎకరాలలో వరి, అలాగే 150 ఎకరాలలో జొన్న, 75 ఎకరాలలో మినుము పంటలు దెబ్బతిన్నట్లు అగ్రికల్చర్ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. చిన్నమాచుపల్లి, ఉప్పరపల్లి, గుర్రంపాడు, రాచిన్నాయపల్లి, ముండ్లపల్లి, శివాలపల్లి, చెన్నూరు తదితర గ్రామాలలో పంట నష్టం వాటిల్లినట్లు వారు తెలిపారు. ఈ నష్టాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళుతామని మండల వ్యవసాయ అధికారి శ్రీదేవి తెలిపారు. మండల వ్యవసాయ సలహాదారులు ఎర్రసాని మోహన్‌రెడ్డి, తహసీల్దార్ పటాన్ అలీఖాన్, మండల కో ఆప్షన్ నెంబర్ వారిష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకుంటాం

వల్లూరు : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని కొట్లూరులో నేల కొరిగి దెబ్బతిన్న వరి పంటను రాష్ట్ర హార్టికల్చర్ అడ్వైజర్ సంబటూరు ప్రసాద్‌రెడ్డితో కలిసి జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఐతా నాగేశ్వరరావు మంగళవారం పరిశీలించారు. కోత దశలో వున్న వరి పొలంలో మొలకలు వస్తుండటాన్ని గమనించారు. అనంతరం రైతులలో పంట నష్టం గురించి ఆరా తీశారు. కోత దశలో వున్న వరి పంట చేతికొచ్చే సమయంలో నేల కొరిగి మొలక వస్తుండటంతో నష్టపోవాల్సి వస్తోందని, తమను ఆదుకోవాలని రైతులు విన్నవించారు. పంట నష్ట వివరాల నివేదికను ప్రభుత్వానికి పంపుతామని, నష్టపోయిన రైతులను ఆదుకోవడానికి కృషి చేస్తామని వారు రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కమలాపురం వ్యవసాయ సహాయ సంచాలకులు నరసింహారెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నేతలు మస్తాన్, పుల్లయ్య, రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధి చూసి ఓర్వలేకనే విమర్శలు



మాట్లాడుతున్న బలిజ సంఘం నాయకులు

పులివెందుల టౌన్ : పులివెందుల అభివృద్ధిని చూసి ఓర్వలేకనే టీడీపీ ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి లేనిపోని విమర్శలు చేస్తున్నారని శ్రీకృష్ణదేవరాయ బలిజ సంఘం అధ్యక్షుడు గూడూరు గురుప్రసాద్ విమర్శించారు. మంగళవారం స్థానిక శ్రీకృష్ణ దేవరాయ బలిజ సంఘం కార్యాలయంలో బలిజ సంఘ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులివెందుల టీడీపీ నేతల తీరుతో జిల్లాకు చెడ్డ పేరు తెస్తున్నారని.. ఒకవైపు చంద్రబాబు, లోకేష్‌లు పులివెందుల గుండాలు, రౌడీలంటూ ప్రజలను హేలన చేస్తున్నారన్నారు. మరోవైపు ఇక్కడున్న స్థానిక టీడీపీ గల్లీ లీడర్లు మాత్రం అభివృద్ధిని చూడలేక ఆక్రోశం పట్టలేకున్నారన్నారు. స్థానిక సిరిబండి రస్తా విషయంపై ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ విజయరామరాజుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. ప్రజలకు ఏ విధంగా న్యాయం చేయాలో వారికి తెలుసు అని.. అంతేకానీ మీ బోడి సలహాలు అవసరంలేదన్నారు. అభివృద్ధి జరగాలంటే ఎక్కడైనా కొన్ని మార్పులు అవసరమని.. మన ప్రాంత ప్రజలు అభివృద్ధి కోరుకుంటున్నారని.. అందులో భాగంగానే ఈ మార్పులు, చేర్పులు జరుగుతున్నాయన్నారు. పులివెందులలో జరుగుతున్న అభివృద్ధిని చూసి తట్టుకోలేక టీడీపీ నేతలు అక్కసుతో ఏదేదో మాట్లాడుతున్నారని విమర్శించారు. ఎన్నో ఏళ్ల వర్షపాతం రికార్డులు పరిశీలించి అధికారులు ఏదైనా నిర్మాణాలు చేపడుతుంటారని.. గరండాల్ వంక సుందరీకరణ విషయంలో కూడా అదే జరిగిందన్నారు. గరండాల్ వంక విషయంపై టీడీపీ నేతలు ఏదేదో ఊహించుకుని మాట్లాడటం వారి అజ్ఞానానికి నిదర్శనమన్నారు. టీడీపీ నేతలు ప్రజలలో చిచ్చుపెట్టి తద్వారా రాజకీయంగా పబ్బం గడపాలనుకోవడం వారి దిగజారుడు రాజకీయాలకు కొలమానమన్నారు. పచ్చమీడియా ఉంది కదా అని నోటికొచ్చినట్లు వాగడం తగదన్నారు. టీడీపీ నాయకులు ఇప్పటికే చెల్లని నాణేలుగా ప్రజలలో చెలామణి అవుతున్నారన్నారు. వైఎస్ జగనన్న, అవినాష్ అన్న చేస్తున్న అభివృద్ధికి టీడీపీ నేతలు ఇప్పటికైనా సహకరిస్తే ప్రజలు హర్షిస్తారన్నారు. కార్యక్రమంలో బలిజ సంఘం సీనియర్ నాయకులు యార్వ వెంకటసుబ్బయ్య, కడియాల లక్ష్మీనారాయణ, ఐటీఐ సాయి, ఆంజనేయులు, కూరగాయల ప్రసాద్, వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ లక్కీడీప్ విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలతో ఆర్టీసీ డిప్యూటీ సీఎంఈ భాస్కర్, ఇన్‌చార్జి డీఎం గోవర్ధన్‌రెడ్డి, తదితరులు

పులివెందుల రూరల్ : గతనెల 16వ తేదీ నుంచి 30వ తేదీవరకు పులివెందుల–కడప పల్లె వెలుగు బస్సు సర్వీసులలో ప్రయాణం చేసిన వారు లక్కీడ్రా ద్వారా వచ్చిన ముగ్గురు చంద్రమోహన్, పద్మావతి, ఆర్.చంద్రలకు మంగళవారం పులివెందుల ఆర్టీసీ డిప్యూటీ సీఎంఈ భాస్కర్, ఇన్‌చార్జి డీఎం గోవర్ధన్‌రెడ్డి, ఎస్‌టీఐ కుళ్లాయప్పలు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రయాణీకులు ఆర్టీసీ బస్సులలో ప్రయాణించి ఆదరించాలని కోరారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న డిప్యూటీ డెమో ఆఫీసర్ రమణమ్మ

పులివెందుల రూరల్ : ఎక్కడైనా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తప్పవని డిప్యూటీ డెమో ఆఫీసర్ రమణమ్మ తెలిపారు. మంగళవారం పట్టణంలోని భాకరాపురం అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఆశాడే కార్యక్రమంలో భాగంగా డాక్టర్ శాంతికుమార్ ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లకు పీసీపీఎన్‌డీటీ చట్టం, గర్భస్థ పూర్వ, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల వ్యతిరేక చట్టం మీద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డెమో ఆఫీసర్ మాట్లాడుతూ ఆడ శిశువుల సంఖ్య పెరగాలంటే పీసీపీఎన్‌డీటీ చట్టం గురించి అందరికి వివరించాలని.. అలాగే లింగ నిర్ధారణ చేసుకుని ఆడపిల్ల అని తెలిసిన వెంటనే అబార్షన్ చేయించుకున్న వారికి జరిమానా, జైలు శిక్షతోపాటు ఆ సెంటర్లను మూసివేస్తారన్నారు. ఆరోగ్య శాఖ అందిస్తున్న అన్ని సేవల గురించి ప్రతి ఒక్కరికి తెలియజేయాలన్నారు. ఆరోగ్య శ్రీ పథకం గురించి ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ డాక్టర్ సతీష్‌కుమార్, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్ధయ్య, ఐసీటీసీ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

లింగ నిష్పత్తిపై అవగాహన

ఎర్రగుంట్ల : మండల పరిధి చిలంకూరులోని ప్రభుత్వ ఆసుపత్రిలో లింగ నిష్పత్తిపై అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. డీఈఎంఓ భారతి మాట్లాడుతూ 1000 మంది మగ పిల్లలకు 770 మంది ఆడ పిల్లలు ఉన్నారన్నారు. ఆడపిల్లల నిష్పత్తి తగ్గిపోతోందని సమాజంలో ఆడ, మగ ఇద్దరూ సమానం అన్నారు. భ్రూణ హత్యలు నేరమని చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సాయిచరితరెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ నాగమునిరెడ్డి, మల్లయ్య, కుమారి, సీహెచ్ఓ రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

సభాస్థలి పరిశీలన

చెన్నూరు : మండలంలోని కొండపేటలో ఈనెల 10వ తేదీన జరిగే సామాజిక సాధికార బస్సు యాత్ర సభాస్థలిని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ అధ్యక్షుడు పులి సునీల్‌కుమార్, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మ రాజేంద్రప్రసాద్‌రెడ్డిలు మంగళవారం పరిశీలించారు. సభాస్థలి ప్రాంగణం అలాగే పార్కింగ్ సదుపాయం తదితర విషయాలపై వారు కొండపేట స్థానిక, మండల నాయకులతో మాట్లాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్ పాల్గొన్నారు.

నేడు ప్రజా వేదిక

వీరపునాయునిపల్లె : మండలంలోని 22 పంచాయతీల్లో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన పనులపై బుధవారం ఉదయం 10 గంటలకు స్థానిక వెలుగు కార్యలయంలో ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏపీఓ ప్రార్థసారథి తెలిపారు.

నేడు ఎమ్మెల్యే రాక

కమలాపురం : మండలంలోని కోగటం గ్రామంలో బుధవారం అభివృద్ధి పనులకు భూమి పూజ చేయడానికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి హాజరు కానున్నారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆయన కోరారు.